నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

3 సోమవారం 21 ఏప్రిల్ 2025

MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# హజ్ యాత్రికులకు సన్మానం

జన్నారం, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని పొనకల్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు అక్బర్, అంజద్ జావేద్, వారి తల్లిదండ్రులు హజ్‌యాత్రకు వెళ్తుండగా, బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బూక్యా జాన్సన్ నాయక్ ఆదివారం వారిని సన్మానించారు. దేవుని సన్నిధిలో ప్రార్థనలు చేసి.. తిరిగి క్షేమంగా తిరిగి రావాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫజల్‌ఖాన్, నర్సాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



హజ్ యాత్రకు వెళ్తున్న వారిని సన్మానిస్తున్న జాన్సన్‌నాయక్

## మళ్లీ రాబోయేది కేసీఆర్ పాలనే

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో మళ్లీ రాబోయేది కేసీఆర్ పాలనేనని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. ఆదివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తన స్వగృహంలో చెన్నూరు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డా. రాజారమేశ్, వాలా శ్రీనివాసరావు, సుదర్శన్‌గౌడ్, బడికల సంపత్, రామిడి కుమార్, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి అమరులకు నివాళి

- సంప్రదాయబద్ధంగా శ్రద్ధాంజలి ఘటించిన ఆదివాసులు
- నివాళులర్పించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ప్రముఖులు
- స్తూపం వద్ద పోలీసుల భారీ బందోబస్తు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20 : హీరాపూర్ గ్రామ సమీపంలో గల అమరవీరుల స్తూపం వద్ద రగల్ జెండా అమరవీరుల ఆశయ సాధన కమిటీ, ఆదివాసీ గిరిజన పెద్దల ఆధ్వర్యంలో స్వేచ్ఛగా నివాళులర్పించారు. ఏప్రిల్ 20, 1981లో పోలీసుల కాల్పుల్లో అమరులైన ఆదివాసులకు గిరిజనులు తమ సంస్కృతి సంప్రదాయబద్ధంగా పూజలు చేసి, శ్రద్ధాంజలి ఘటించారు. అధికారికంగా నిర్వహించిన 44వ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు ఆదివారం ఉదయం10 గంటలకు అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. గోండ్‌గూడ నుంచి ప్రారంభమైన ర్యాలీ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంది. ముందుగా అమరవీరుల పేరిట జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నిర్వహించే సంప్రదాయ పూజ కార్యక్రమాలను ప్రారంభించారు. అమరవీరుల స్తూపంతోపాటు జెండాల వద్ద సంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యులతోపాటు ఆదివాసులు నివాళులర్పించారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

### తొడసం ఖట్టికి నివాళి

గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేసి మృతి చెందిన తోడసం ఖట్టికి తుమ్మగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండలంలోని తుమ్మగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో సమక ఎక్స్‌రోడ్డు వద్ద ఖట్టి స్మారకార్థం ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. యేటా ఏప్రిల్ 20న సంస్మరణ దినంగా నిర్వహిస్తున్నామన్నారు.

### నివాళులర్పించిన ప్రముఖులు

ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేశ్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, ప్రేమ్‌సాగర్ రావు, కోవ లక్ష్మి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్‌సింగ్, డీఎఫ్‌వో బాజీరావ్ పాటిల్, మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగణక్క, బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, రాయిసెంటర్ల సార్‌మేడీలు మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, మెస్రం చిన్ను పటేల్, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు గోడం గణేశ్, కోడప నగేశ్, ఆత్రం భుజంగ్‌రావ్, కనక తుకారాం, ముకాడే విష్ణు, బోంత ఆశా రెడ్డి, తిరుపతి, కనక హనుమంత్‌రావ్, పెందర్ పుష్పారాణి, గరల్ జెండా అమరవీరుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావ్, ప్రధాన కార్యదర్శి మెస్రం నాగ్‌నాథ్, తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు పుర్కా చిత్రు, గౌరవ అధ్యక్షుడు జుగ్నాక్ భారత్, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, మెస్రం ఆనంద్‌రావ్, కనక తులసీరామ్, మానిక్‌రావ్, రాజ్‌వర్ధన్, దీలిప్‌మోరే, రాజలింగు, కోడప నగేశ్‌లు అమరులకు నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

### రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది..

**సీతక్క, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి**

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పును ఒప్పుకుని ఇంద్రవెల్లి అమరులను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవడానికి సంక్షేమ పథకాలు అందిస్తుందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారింగా నిర్వహిస్తుందన్నారు. 1981, ఏప్రిల్ 20న మృతి చెందిన అమరుల కుటుంబాలకు ఇండ్లస్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం నాలుగు కుటుంబాలకు వాహనాలు అందించామన్నారు. కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలను గుర్తించడానికి ఐటీడీఏ ద్వారా కమిటీ ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తామన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడానికి కమిటీని ఏర్పాటు చేసి పూర్తి వివరాలు సేకరించిన తరువాతనే ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రూ.15 కోట్లతో ఉట్నూర్‌తోపాటు ఏటురునాగారంలో కొత్తగా ఐటీడీఏ కార్యాలయాల నిర్మాణానికి ప్రణాళికలు చేశామన్నారు.



అమరవీరుల జెండా వద్ద పూజలు చేస్తున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

### స్తూపం వద్ద భారీ బందోబస్తు

ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌తోపాటు ఉట్నూర్ సీఐ మొగిలి, ఇంద్రవెల్లి ఎస్ఐ సాయన్నల ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండ ముందస్తు చర్యలు తీసుకున్నారు. పోలీసు అధికారులు దగ్గర ఉండి బందోబస్తును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.




సీసీసీ నస్పూర్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

# ఉద్యమ స్ఫూర్తితో కదలిరండి

## పదేళ్ల పాటు ప్రజలకు సుపరిపాలన అందించాం

- హామీల అమలులో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ సర్కారు
- కుట్రలు, కుతంత్రాలు, కేసులతో బీఆర్‌ఎస్ కార్యకర్తలకు వేధింపులు
- ప్రజా సమస్యలు పక్కన పెట్టి పదవుల కోసం పాకులాడుతున్న జిల్లా ఎమ్మెల్యేలు
- చెన్నూర్ నుంచే మళ్లీ పోటీ చేస్తా.. తనపై దుష్ప్రచారం మానుకోవాలి
- విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 20 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించబోయే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఉద్యమ స్ఫూర్తితో కదలివచ్చి జయప్రదం చేయాలని మంచిర్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. ఆదివారం నస్పూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమనేత కేసీఆర్ గాంధేయ పద్ధతిలో పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించారని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పదేళ్లపాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని కొనియాడారు. ప్రస్తుతం ప్రజలకు తమకు ఇచ్చిన ప్రతిపక్ష హోదాను సమర్థవంతంగా నిర్వహిస్తూ..కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు విధానాలపై పోరాడుతున్నామన్నారు. రజతోత్సవ సభ సందర్భంగా చెన్నూర్, మంచిర్యాలలో వాల్‌రైటింగ్‌లను అధికారులు తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నదని, కేసులు పెట్టి బీఆర్‌ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. గోడలపై కేసీఆర్ పేరును తొలగించవచ్చునేమో కానీ.. ప్రజల గుండెల నుంచి ఆయనను విడదీయలేరన్నారు.



రామకృష్ణాపూర్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

### బీఆర్‌ఎస్ హయాంలోనే జిల్లా అభివృద్ధి

మంచిర్యాల జిల్లా ఏర్పాటు చేసి ప్రజల దశాబ్దాల కోరిక నెరవేర్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, బ్రిడ్జిలు, డ్రైనేజీలు, ఎత్తిపోతల పథకాలు.. ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆదర్శంగా నిలిపామని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొత్తగా తెచ్చిన నిధులేవీ లేవన్నారు. జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీల అమలులోనూ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాల్సిన ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం కొట్లాడుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే తమ కార్యకర్తలపై కేసులు పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కరెంట్, సాగునీటి కష్టాలను పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనేనాథుడు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.



సీసీసీ నస్పూర్ : సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

### 40 వేల ఉద్యోగాలేవి వివేక్..!

ఎన్నికల సమయంలో చెన్నూర్ ప్రజలకు అనేక హామీలిచ్చి గెలిచిన వివేక్.. వాటిని అమలు చేయడం లో విఫలమయ్యారని బాల్క సుమన్ ఆరోపించారు. అధికారంలోకి రాగానే 40 వేల ఉద్యోగాలు ఇస్తామన్నారని, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, మైనింగ్ కళాశాల, వంద పడకల దవాఖాన.. తదితర హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. తాను చెన్నూర్‌కు తీసుకువచ్చిన బస్సు డిపో, రెవెన్యూ డివిజన్‌పై ఇంత వరకు మాట్లాలేదన్నారు. కోట్లాది రూపాయలతో చెన్నూర్‌ను అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ హయాంలో ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని చెప్పారు. తమ హయాంలో చెన్నూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్, క్యాతన్‌పల్లిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే.. తామే కట్టినట్లు కాంగ్రెస్ ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. చెన్నూర్ నియోజకవర్గం నుంచి వెళ్లిపోతానని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేసి గెలుస్తానన్నారు. జిల్లాలో గంజాయి గుప్పుమంటున్నదని, చెన్నూర్‌లో జోరుగా ఇసుక దందాకు తెరలేపారని, కోట్లాది రూపాయల సంపదను కాంగ్రెస్ నాయకులు జేబులో వేసుకుంటున్నారని, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ పార్టీ నేతలకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని ఎత్తివేశారని, పత్తి కొనుగోళ్లు చేయాలని రైతులు రోడ్డెక్కే వరకూ కొనుగోళ్లు చేయలేదన్నారు. తన తండ్రి హాస్పిటల్‌లో వెంటిలేటర్‌పై ఉండగా, రైతుల కోసం హైదరాబాద్ నుంచి వచ్చి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించి, రూ. 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పదవుల కోసం పాకులాడకుండా సమస్యలపై దృష్టిపెట్టాలని ఆయన సూచించారు.

### సభకు తరలిరావాలి..

రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని బాల్క సుమన్ పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గం నుంచి 3 వేల చొప్పున మొత్తం 30 వేలకు పైగా రజతోత్సవ సభకు తరలిరానున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ కళ్లలో బైర్లు కమ్మేలా రజతోత్సవ సభ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా సభను విజయవంతంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, చెన్నూర్ నియోజకవర్గం బాధ్యుడు డాక్టర్ రాజారమేశ్, నస్పూర్ పట్టణ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, నాయకులు బడికెల సంపత్‌కుమార్, పెట్టం లక్ష్మణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మంచిర్యాల ఆర్టీసీ డిపోలో నిలిచిన బస్సులు



మంచిర్యాల బస్టాండులో వేచిఉన్న ప్రయాణికులు

# కదలని బస్సులు ప్రయాణికుల పాట్లు

## మంచిర్యాల డిపోలో టిమ్ మిషిన్స్‌లలో సాంకేతిక లోపం

- ఉదయం ఐదింటి నుంచి తొమ్మిదింటి వరకూ నిలిచిన 'ప్రగతి' చక్రాలు
- పున:రుద్ధరణతో యథావిధిగా సేవలు

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 20 : మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ఆదివారం ఉదయం తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల నాలుగు గంటలపాటు బస్సులు నిలిచిపోయాయి. టికెట్ ఇష్యూయింగ్ మిషిన్(టిమ్)లకు సంబంధించిన సర్వర్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో వాహనాలు బయటకు రాకపోగా, ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉదయం మూడు గంటల నుంచే టికెట్ మిషిన్‌లు పనిచేయడం మానేశాయి. తెల్లవారు జామున ఐదు గంటలనుంచి బస్సులు ప్రారంభమైన సందర్భంలో టిమ్‌లలో ఏర్పడిన సమస్యను కండక్టర్లు, డ్రైవర్లు గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అధికారులు టిమ్‌లను పునరుద్ధరించడానికి ప్రయత్నం చేశారు. ఆదివారం కావడంతో సిబ్బంది అందుబాటులో లేని కారణంగా జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. చివరకు ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో బస్సులు యథావిధిగా నడిచాయి. అత్యంత రద్దీగా ఉండే రూట్లైన గోదావరిఖని, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూరు, కరీంనగలకు బస్సులు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఇతర డిపోలకు చెందిన బస్సుల ద్వారా కొందరు తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. మరికొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఈ విషయంపై మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్‌ను వివరణ కోరగా.. డాటాబేస్‌లో ఫైల్స్ కరప్ట్ కావడంతో టిమ్ మిషిన్‌లలో అప్‌డేట్ కాలేదని, సమస్యను సత్వరమే పరిష్కరించి బస్సులను నడిపించామన్నారు.

### బ్రీత్‌ఎనలైజర్ తెచ్చిన తంటా ?

టిమ్ మిషిన్‌లలో సాంకేతిక సమస్యలు ఏర్పడడానికి సిబ్బందికి బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడమే కారణమన్నట్లు తెలుస్తోంది. కంప్యూటర్ ఆపరేటర్లకు సెక్యూరిటీ సిబ్బంది బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాలని పట్టుబట్టడమే ఆలస్యానికి దారితీసినట్లు సమాచారం. సాధారణంగా డ్యూటీలోకి తీసుకునే ముందు డ్రైవర్లకు, కండక్టర్లకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేస్తుంటారు. గడిచిన కొన్ని రోజులుగా డీఎం కార్యాలయంలో పనిచేసే డాటా ఎంట్రీ, కంప్యూటర్ ఆపరేటర్‌లకు కూడా పరీక్షలు చేయాలని చూడడంపై నిరసన వ్యక్తమవుతోంది. వాస్తవానికి వీక్లీఆఫ్ రోజుల్లో కూడా వీరు సంస్థకు సేవలు అందిస్తున్నారు.

### డీఎం కార్యాలయ తాళాలు మాయం

మంచిర్యాల ఆర్టీసీ డిపో కార్యాలయానికి సంబంధించిన తాళాలు మాయమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో గ్యాస్ కట్టర్ సాయంతో ఆఫీసు తాళాలను తెరిచినట్లు తెలుస్తోంది. గురువారం సాయంత్రం విధులు ముగించుకున్నాక యథావిధిగా డిపో కార్యాలయ సిబ్బంది సెక్యూరిటీ కార్యాలయంలో తాళాలను అందజేసి వెళ్తారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సెలవు కావడంతో అటువైపుగా ఎవరూ వెళ్లలేదు. కానీ, శనివారం ఉదయం 10 గంటలైనా డీఎం కార్యాలయానికి తాళాలు తెరవక పోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సెక్యూరిటీ విభాగం వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.



టీ స్టాల్‌లో వరంగల్ రజతోత్సవ సభపై ప్రచారం నిర్వహిస్తున్న కోవలక్ష్మి



వాంకిడిలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న అజయ్ కుమార్

# ఊరూరా ప్రచారం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ) : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు ప్రజలను తరలించేందుకు బీఆర్‌ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మితో పాటు మాజీ సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పల్లె పల్లెకూ వెళ్లి పోస్టర్లు ఆవిష్కరిస్తూ.. వాల్ రైటింగ్ చేయిస్తూ ప్రజలను ఉత్తేజ పరుస్తున్నారు. కేసీఆర్ పాలనలో సాధించిన ప్రగతిని వివరిస్తూనే.. కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎత్తి చూపుతున్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నరు. కాగా, ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో రజతోత్సవ సభ పోస్టర్లను విడుదల చేశారు. వాంకిడిలో మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు.

# అపూర్వ సమేళనం

జన్నారం, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1982-83లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఆర్‌ఆర్‌ఎస్ కమ్యూనిటీహాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకేచోట చేరి తీపి గుర్తులను నెమరేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సుధాకర్‌రెడ్డి, బీ జనార్దన్, మడిపెల్లి దక్షణమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాముల మధుసూదన్ చారి, నరేందుల రమేశ్, కిషన్, కొత్త సత్యం, శ్యామ్, ప్రభాకర్, రశీద్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

